క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: గద్వాల మండలంలోని పూడూరులో ఉన్న 33కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని కొండపల్లి ఫీడర్‌పై లూజ్‌లైన్ ఉండడంతో వాటిని సరి చేయనున్న నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గద్వాల రూరల్ ఏఈ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పోల్ ఏర్పాటు చేస్తుండడంతో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.
అలంపూర్: అలంపూర్ సబ్ డివిజన్ పరిధిలో, ఇటిక్యాల మండలంలోని చాగాపురం సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్‌లో విద్యుత్ లైన్‌మన్ మరమ్మతులు చేపట్టడంతో చాగాపురం, బట్లదిన్నె, వల్లూరు గ్రామాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని తెలిపారు. ఉండవెల్లి మండలంలో అలంపూర్ క్రాస్ రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో బొంకూరు లైన్‌లో ఒరిగిన స్తంభాలను సరిచేయడంతో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తారని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేయండి



రాజోళి: మండలంలోని పచ్చర్లలో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ పనులను వేగవంతం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో 33/11కేవీ సబ్ స్టేషన్ నిర్మించేందుకు ఆరేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. నేటి వరకు పనులు పూర్తి చేయడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పూర్తయితే పచ్చర్లతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు విద్యుత్ కష్టాలు తీరతాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు వేగంగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై ప్రజల నిరసన



అయిజ: మండల కేంద్రం నుంచి పులికల్ గ్రామం వరకు నిర్మించ తలపెట్టిన రోడ్డు ఆరేళ్లుగా పూర్తి చేయలేదని తుపత్రాల, మేడికొండ, పులికల్ గ్రామాల ప్రజలు బుధవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గంట పాటు వాహనాలు నిలిచి పోయాయి. ఆరేళ్ల క్రితం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి కంకర వేశారని, ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయలేదని మండిపడ్డారు. రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో రోడ్డుపై వెళ్తున ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు అదుపుతప్పి పక్కనున్న గుంతలో పడిపోతున్నాయని వాపోయారు. ఇప్పటి వరకు అనేక మందికి తీవ్రగాయాలయ్యాయని, దీర్ఘ కాలిక చికిత్స పొందుతూ కొంతమంది మృతి చెందినట్లు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయాలని కోరారు.

16న మండల సర్వసభ్య సమావేశం

ధరూరు: ఈ నెల 16న మండల సర్వసభ్య సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మంజుల ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి మండల ప్రజా ప్రతినిధులతో పాటు, అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ

మల్దకల్: మండల కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా పరీక్షలు రాయాలని సూచించారు. మొత్తం 132మంది విద్యార్థులకు గాను 128మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహులు, డిపార్ట్‌మెంటల్ అధికారి సత్యనారాయణ తెలిపారు.

కాన్షీరాం జయంతిని విజయవంతం చేయాలి

అలంపూర్: కాన్షీరాం జయంతిని విజయవంతం చేయాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి కేశవరావు అన్నారు. బుధవారం అలంపూర్ చౌరస్తాలోని బీఎస్పీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. ఈ నెల 15న కాన్షీరాం జయంతి సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఫంక్షన్ హాల్లో నిర్వహించే ఉత్సవాలకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతారని, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, ప్రభుదాస్, అయ్యన్న, తదితర్లు పాల్గొన్నారు.

శాశ్వత భవనాల్లేక సమస్యలు

- 16 గ్రామాలతో మండలం ఏర్పాటు
- అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు
- స్థలాలు చూడటమే కానీ, నిర్మాణం లేదు..
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, ప్రజలు



ఉండవెల్లి పంచాయతీ కార్యాలయంలో మహిళా సమాఖ్య సభ్యుల సమావేశం

ఉండవెల్లి: పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం నూతన జిల్లాలను, మండలాలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో అలంపూర్, మానవపాడు మండలాల్లోని 16 పంచాయతీలను కలిపి ఉండవెల్లి మండలంగా ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలకు పరిపాలన పరంగా సత్వర సేవలు అందుతూ పలు ప్రయోజనాలు చేకూరుతున్నాయి. వివిధ గ్రామాలను మండల కేంద్రంతో కలపడానికి కొన్ని రహదార్ల నిర్మాణం పూర్తికాగా, మరికొన్ని ప్రగతిలో ఉన్నాయి. అయినప్పటికీ మండలంలో కొన్ని సమస్యలు ఇంకా తీరడం లేదు.

విద్యా, వైద్యం మెరుగుపడాలి..
నూతనంగా ఏర్పడిన మండలంలో వైద్య పరంగా మెరుగైన సౌకర్యాలు కరువయ్యాయి. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ఎంపీడీఓ కార్యాలయం ఉండడంతో ఉపాధ్యాయులు ప్రైవేట్ విద్యాసంస్థల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. వైద్యం కోసం పక్క రాష్ట్రానికి, లేక పాత మండలాలకు వెళ్లాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. ఆరోగ్య కేంద్రం మంజూరై స్థలాలు చూసి ఎంపిక చేసినా, ప్రభుత్వం మారడంతో ఆ విషయం పక్కన పెట్టేశారు. మండల కేంద్రంలో ఉన్నత విద్య కోసం ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయాలని చాలాకాలంగా ప్రజలు కోరుతున్నారు. కళాశాల ఏర్పాటు కాకపోవడంతో ప్రైవేట్ కళాశాలకే పరిమితమవుతున్నారు.

శాశ్వత భవనాలు కరువు..
మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు నేటికి శాశ్వత భవనాలు లేవు. పోలీస్‌స్టేషన్ అద్దె ఇంట్లో ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ కార్యాలయం ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. వ్యవసాయ కార్యాలయం రైతు సంఘం భవనంలో కొనసాగుతోంది. తహసీల్దార్ కార్యాలయం అద్దె ఇంట్లో ఉంది. మహిళా సమైఖ్య భవనం పీఏసీఎస్ గోదాంలోని భవనంలో ఏర్పాటు చేశారు. భవనాన్ని 10 ఏళ్లలైనాఅ సంపూర్తిగా నిర్మించి ఆపేశారు.



ఉండవెల్లిలో రైతు సంఘం భవనంలో ఏర్పాటైన వ్యవసాయ కార్యాలయం

అసంపూర్తిగా భగీరథ పనులు..
మిషన్ భగీరథ పథకంలో భాగంగా చేపట్టిన పనులు అనేక గ్రామాల్లో అసంపూర్తి దశలోనే ఉన్నాయి. పలు గ్రామాల్లో ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇవాల్సి ఉంది. మారమునగాల-1 గ్రామానికి నీరు చేరడం లేదు. అధికారులకు చెబితే భగీరథ నీరు తాగరు కదా ఎందుకు మరి అని తీసిపాడేస్తున్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలి
రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చడానికి అదనంగా బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలి. పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించాలి. కొన్ని గ్రామాల్లో హరితహారంపై శ్రద్ధ చూపడం లేదు. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. గ్రామాల్లో పశువుల తాగునీటి కోసం నీటి తొట్టెలు నిర్మించాలి. యువతకు క్రీడా స్థలాన్ని కేటాయించాలి. ఆయకట్టు చివరి గ్రామాలకు సాగునీరు అందించాలి. ప్రతి ఏడాది సమస్యగానే మారుతోంది. వాటిపై శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

సొంత భవనాలు నిర్మించాలి..



నూతన మండలంలో ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రభుత్వ కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మించలేదు. దీంతో అధికారులు, ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.
– రమణ, ఉండవెల్లి

ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తాం..



మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి సంబంధిత శాఖల అధికారులకు అప్పగించాం. కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని సవరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.
– సలీముద్దీన్, తహసీల్దార్, ఉండవెల్లి

వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే



సాతర్లలో వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని సాతర్లలో వాల్మీకి విగ్రహాన్ని ఎమ్మెల్యే విజయుడు ఆవిష్కరించారు. అనంతరం ఆయా గ్రామాల నాయకులు ఎమ్మెల్యేకు పూల మాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌రెడ్డి, నారాయణ నాయుడు, జయచంద్రారెడ్డి, పోతురాజు సోమనాద్రి, వెంకటన్నగౌడ్, రామానాయుడు, వాల్మీకి సోదరులు, యువత, గ్రామస్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



కేటీదొడ్డి: మండలంలోని ఇర్కిచేడుకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కావలి జంగిలప్ప గుండెపోటుతో మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బుధవారం వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ విజయ్‌కుమార్, జంబురామన్‌గౌడు, శ్రీధర్, కృష్ణ, భగవంతు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ఎర్రవల్లిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడంతో ఎర్రవల్లి కూడలిలో అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దిలేటి, నర్సింహులు, రాజ్‌కుమార్, బజారి, రాజు, అంజి, రవి, రాంప్రసాద్ ఉన్నారు.
ఉండవెల్లి: మండలంలోని మండల కేంద్రం, కంచుపాడు, చిన్న ఆముదాలపాడు, గ్రామాల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తుండడంతో సీఎం రేవంత్ రెడ్డి, సోనియాగాంధీ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం ముందు ఏర్పాటు చేశారు. కంచుపాడులో ఏఐసీసీ సెక్రటరీ ఎస్ఏ సంపత్‌కుమార్, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. చిన్న ఆముదాలపాడులో కాంగ్రెస్ జాతీయ నాయకురాలు సోనియా గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు నాగేష్, రమేష్, మండల నాయకులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలో..



మానవపాడులో..

మానవపాడు: అలంపూర్ నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం మండల అధ్యక్షులు జగన్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్దకల్ రాజు, రాఘవరెడ్డి, బ్రహ్మేశ్వర్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

కార్యదర్శికి సన్మానం



గట్టు: మండలంలోని తప్పెట్లమొర్సు కార్యదర్శిగా పని చేసి, బదిలీపై వెళ్లిన తిమ్మప్పను బుధవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచు కృష్ణయ్యగౌడు, గ్రామ యువకులు కలిసి పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి తిమ్మప్పను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల ఉపాధ్యక్షుడు దయాకర్, గ్రామ యువకులు కృష్ణ, పెద్ద సవారన్న, పరుశరాముడు, బుడ్డన్న, శీను, దేవప్ప, రాఘవేంద్ర పాల్గొన్నారు.

కూలీలకు డబ్బులు చెల్లించాలి

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లులో బుధవారం ఉపాధి పనుల ప్రదేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు కూలీల సమస్యలు తెలుసుకున్నారు. గతేడాది చేసిన పనులకు పెండింగ్ కూలి డబ్బులు చెల్లించాలి, ప్రతి జాబ్ కార్డుకు 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలని కోరారు. పెండింగ్ కూలీ డబ్బులు ఇవ్వకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

రోగనిరోధక టీకాలు వేయించండి



కిష్టాపురంలో పశువులకు వ్యాక్సిన్ వేయిస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి



పైపాడులో గేదెకు టీకా వేస్తున్న డాక్టర్ పుష్పలత

అయిజ: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి తెలిపారు. మండలంలోని భూంపురం, కిష్టాపురం గ్రామాల్లో పశువులకు వెటర్నరీ సిబ్బంది వ్యాక్సిన్ వేశారు. మొత్తం 157 పశువులకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. గాలికుంటు వ్యాధి అరికట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా టీకాలు అందజేస్తుందన్నారు. పశువులకు తప్పని సరిగా టీకాలు వేయించాలని కోరారు.
శాంతినగర్: పశువులకు సీజనల్ వ్యాధులు సోకుతాయని, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే పశుసంపదకు నష్టం వాటిల్లదని డాక్టర్ పుష్పలత అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని యజమానులకు సూచించారు. గ్రామంలోని 34 మంది రైతులకు చెందిన 221 పశువులకు టీకాలు వేసినట్లు డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వరప్రసాద్, లతీఫ్, రవికిరణ్, గోపాల మిత్ర లక్ష్మన్న పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల గ్రామంలో బాల్యం వివాహం నిర్వహిస్తున్న వారిపై కేసు నమోదైంది. ఎస్ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం తుపత్రాల గ్రామంలో కొందరు వ్యక్తులు బాల్యవివాహం నిర్వహిస్తుండడంతో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ కమలాదేవి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీడీపీఓతో పాటు పోలీసుఅధికారులు వెళ్లి బాల్యవివాహాన్ని నిలిపేశారు. బాలికను రెస్క్యూ చేసి, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ ప్రకారం పెళ్లి కొడుకు, అతని బంధువులు, పెళ్లి కూతురు తరుపు బంధువులు 7మందిపై కేసు నమోదు చేశారు.

శంభో శంకర పాహిమాం

ఆత్మకూర్: పట్టణ శివారులోని చెరవులో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి జాతరలో భాగంగా బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో చివరి రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. వందలాది మంది భక్తులు దాసంగాలు పెట్టారు. రాత్రి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మొదలుకొని పట్టణంలోని పుర వీధుల గుండా భక్తులు స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. రాత్రి రథోత్సవంపై విగ్రహాలు ఉంచి తేరులాగారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలిదిగా పాల్గొన్నారు.

ప్రముఖుల పూజలు
అనంతరం పూజారి కర్బసయ్య ఆధ్వర్యంలో ఎంపీపీ బంగారు శ్రీను, జెడ్పీటీసీ శివరంజని, మాజీఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండోఅధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, జాతర కమిటీ కన్వీనర్ రవికుమార్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు చెన్నయ్య, మండ్లరామకృష్ణ, పోషన్న, అశ్విన్‌కుమార్, మహేశ్వరి, నాగలక్ష్మి, యాదమ్మ, తబస్సూం, రైతుసంఘం అధ్యక్షుడు వీరేశలింగం పాల్గొన్నారు.



స్వామివారి పల్లకీసేవలో భక్తులు



స్వామివారి రథోత్సవం

పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేయాలి

- ఆర్డీఓ రాంచందర్

ఎర్రవల్లిచౌరస్తా: ధరణిలో ఉన్న పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డీఓ రాంచందర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఇటిక్యాల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి పలు రికార్డులను పరిశీలించి, అధికారులతో ఓటరు నమోదు వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిపాలన చేపట్టాలన్నారు. నిత్యం కార్యాలయానికి వచ్చే ప్రజలకు, రైతులకు అధికారులు అందుబాటులో ఉండి వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. గ్రామాల్లో ఓటరు నమోదు ప్రక్రియ, ఫారం-6, 7, 8 దరఖాస్తుల మార్పులు, చేర్పులు, తదితర వాటిని సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, సీనియర్ అసిస్టెంట్ అజీద్, కార్యాలయం సిబ్బంది ఉన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ రాంచందర్

కూలీలకు వేతనాలు చెల్లించండి

మానవపాడు: పెండింగ్‌లో ఉన్న ఉపాధిహామీ కూలీలకు వేతనాలు చెల్లించాలని, ఉపాధి హామీ పనులపై మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ రమణారావు ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో 789 మంది కూలీలకు పనులు కల్పించామన్నారు. అత్యధికంగా కూలీలు కలిగిన మండలం మానవపాడు అని తెలిపారు. ప్రతి గ్రామంలో 100 మందికి కూలీలు కల్పించాలని ఆదేశించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పనిచేసిన కూలీలకు చెల్లింపులు నిలిచిపోయిన చోటా కూలీలందరికి ఆధార్ కార్డు, పాన్‌కార్డు, ఈకేవైసీ ఫామ్ సంబంధిత పోస్టల్ కార్యాలయం అందించి కూలీలకు వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఫీల్డ్‌అసిస్టెంట్‌లను ఆదేశించారు. హరితహారం మొక్కలకు నీటి సదుపాయని గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీటి సౌకర్యాన్ని అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ శంకర్, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ రమణారావు

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి



చెన్నిపాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో పది విద్యార్థులు, ఉపాధ్యాయులు

శాంతినగర్: విద్యార్థులందరు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని రామాపురం జిల్లాపరిషత్ ప్రధానోపాధ్యాయులు (ఎంఈఓ) నరసింహులు సూచించారు. పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ లక్ష్యాలకు అనుగుణంగా క్రమ శిక్షణతో చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు గొప్ప పేరు తేవాలని కోరారు. ఈ సందర్భంగా శాంతినగర్ బోధి ని కళాశాల వారు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, జామెట్రీ బాక్స్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరుణ్‌రషీద్, జీవన్‌కుమార్, దేవేందర్ రెడ్డి, సురేఖ, మధు, రామంజనేయులు, శ్రీను, ధనలక్ష్మి, హరిప్రసాద్, వసంత, ఉమాకాంత్, సాయిబాబ, వెంకటమ్మ, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.
మల్దకల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతంగా ఎదగాలని హెచ్ఎం సురేష్ సూచించారు. మల్దకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10 వతరగతి విద్యార్థులతో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వకుళమాలిక, జ్యోతి, జయప్రభ, మణెమ్మ, వరలక్ష్మి, రమణమ్మ, మల్లిక, సుహాసిని, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.
మానవపాడు: పట్టుదల, ఏకాగ్రతతో చదివితే సాధించలేనిది ఏదీలేదని హెచ్ఎం మణిప్రసూన సూచించారు. మండలంలోని చెన్నిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రియాజ్, అన్వర్, మద్దిలేటి, నాగరాజు పాల్గొన్నారు.



రామాపురంలో..

స్వపరిపాలన దినోత్సవం



ఉప్పేరులో స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ధరూరు: మండలంలోని ఉప్పేరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సునీత, సుజాత, పెద్దయ్య, సునీల్, సీఆర్‌పీ అజంపాష పాల్గొన్నారు.
కేటీదొడ్డి: మండలంలోని ఉమిత్యాలతండా పాఠశాలలో స్వయంపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీరాములు, సీఆర్‌పీ పాపయ్య, రాజునాయక్, బుడ్డన్న ఉన్నారు.
మల్దకల్: మండలంలోని పెద్దొడ్డి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిరనిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నర్సింహులు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, మునెప్ప, ఉమేశ్వరయ్య పాల్గొన్నారు.



పెద్దొడ్డిలో..